సాక్షి వికారాబాద్

శనివారం । 1 । ఏప్రిల్ । 2023



శ్రద్ధచూపితే 'నవోదయమే'

కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జవహర్ నవోదయ విద్యాలయాలు గ్రామీణ, పేద విద్యార్థులకు వరం లాంటివి. 8లో▸



భవానీమాత ఉత్సవాలు

దామర్‌చెడ్‌లో వెలిసిన అంబాభవానీ మాత 49వ జాతర ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. 8లో▸



అభివృద్ధికి కట్టుబడి ఉన్నా

తాండూరు అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, సీఎం కేసీఆర్ చొరవతో ప్రత్యేక నిధులు తెస్తామని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తెలిపారు. 9లో▸



రంజాన్ వేళలు



మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న చీమలదరి గ్రామ సర్పంచ్ నరసింహారెడ్డి, చిత్రంలో మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే ఆనంద్, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

చీమలదరికి జాతీయ గౌరవం

తెలంగాణ ఏర్పాటు తర్వాతే పంచాయతీలు బలోపేతమయ్యాయని చీమలదరి సర్పంచ్ నానప్‌పల్లి నర్సింహారెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శుక్రవారం జాతీయ ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకున్నారు. తాను సర్పంచ్‌గా ఎన్నికైన రోజు నుంచి ఇప్పటివరకు పంచాయతీలో రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టానని తెలిపారు. గ్రామ ప్రజలు, అధికారుల సహకారంతోనే అవార్డు దక్కిందని స్పష్టంచేశారు. జిల్లానుంచి జాతీయ స్థాయి అవార్డు అందుకున్న ఏకైక గ్రామం కావడంతో తమ బాధ్యత మరింత పెరిగిందని స్పష్టంచేశారు. ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి తదితరులు నర్సింహారెడ్డిని అభినందించారు.

– అనంతగిరి

న్యూస్‌రీల్

బార్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ జిల్లా కోర్టు న్యాయవాద సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా అవుటి రాజశేఖర్, కోశాధికారిగా మోహన్‌రాథోడ్, గేమ్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా తులసీరాం నాయక్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శి జగన్, సీనియర్ న్యాయవాదులు కమాల్‌రెడ్డి, లక్ష్మణ్, గోపాల్‌రెడ్డి, నారాయణ, లవకుమార్, సంపూర్ణానంద్, బస్వరాజు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు



ఖైదీలకు అవగాహన కల్పిస్తున్న న్యాయసేవాధికార సంస్థ న్యాయవాదులు

పరిగి: జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సేవలు అందిస్తామని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది శీథల్ అన్నారు. పరిగి సబ్ జైలులో శుక్రవారం ఖైదీలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక సమస్యల కారణంగా లాయర్లను పెట్టుకోలేక ఇబ్బంది పడుతున్న వారికి ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామని తెలిపారు. సదరు వ్యక్తులు తమ సమస్యను న్యాయమూర్తి లేదా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల్ హడల్!

- పంచాయతీలు, మున్సిపాలిటీల్లో శునకాల వీర విహారం
- గుంపులుగా దాడి చేస్తున్న వైనం
- గాయాల పాలవుతున్న చిన్నారులు, మూగజీవాలు
- నియంత్రణ చర్యలకు ప్రజల డిమాండ్





కుక్కల దాడిలో గాయపడిన శివకుమార్ (ఫైల్)

పరిగి: కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఏవీధిలో చూసినా గుంపులుగా తిరుగుతూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఒంటరిగా కనిపిస్తే చాలు చిన్నా, పెద్ద, వృద్ధులు అనే తేడా లేకుండా ఎగబడుతున్నాయి. ద్విచక్ర వాహనదారులపై వెళ్తున్న వారిని సైతం విడిచిపెట్టడం లేదు. వీటి సంతతి నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో సమస్య తీవ్రరూపం దాలుస్తోందని ప్రజలు చెబుతున్నారు. శునకాల దాడుల్లో గాయాలపాలవుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గతంలో వీధి కుక్కలను అరికట్టేందుకు పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక చర్యలు తీసుకునే వారు. జంతు ప్రేమికుల ఒత్తిడితో ప్రస్తుతం వీటిని ఆపేశారు. సంతానోత్పత్తి నియంత్రణ ఆపరేషన్లు చేసే అవకాశం ఉన్నప్పటికీ ఖర్చుతో కూడుకున్న పని కావడంతో అధికారులు పట్టించుకోవడం లేదు.

ఇటీవల కుక్కల దాడులు

- కుల్కచర్ల మండలం బొంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన హేమలత, అనంతరెడ్డి దంపతుల కుమారుడు శివకుమార్ ఇంటిముందు ఆడుకుంటుండగా ఓ వీధి కుక్క దాడి చేసింది. దీంతో బాలుడి ముఖంపై పలు చోట్ల గాయాలయ్యాయి.
- తాండూరులోని కర్బలా మైదాన్ ప్రాంతానికి చెందిన నాలుగేళ్ల బాలిక అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తుండగా వీధి కుక్కలు దాడి చేసి, గాయపర్చాయి.
- పరిగి పట్టణ కేంద్రంలోని చీటర్స్ కాలనీకి చెందిన సన్నీపై వీధి కుక్కలు దాడి చేశాయి. భయాందోళనకు గురైన విద్యార్థి గట్టిగా అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చి, కుక్కలను బెదరగొట్టారు.
- పరిగి మండల పరిధిలోని పలు గ్రామాల్లో లేగ దూడలు, మేకలు, గొర్రెలపై దాడులు చేశాయి.
- గ్రామాలు, పట్టణాల్లోని ప్రధాన చౌరస్తాల వద్ద గుంపులుగా ఉంటున్న శునకాలు దారిన నడుచుకుంటూ వెళ్లే వారిపై దాడులు చేస్తున్నాయి. వీరి చేతుల్లో ఏవైనా కవర్లు వుంటే లాక్కుని వెళ్తున్నాయి.
- రాత్రి సమయాల్లో బయటకు వెళ్తున్న వారు మరొకరిని తోడుగా తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. లేదంటే చేతిలో కర్ర తప్పనిసరి అనేలా మారింది.

కుక్క కాటుతో రేబిస్

- పిచ్చి కుక్కలు కరిచిన మనుషులు, పశువులకు రేబిస్ వ్యాధి సోకే ప్రమాదముంది.
- సకాలంలో టీకాలు వేయించుకోకపోతే ప్రాణాంతకంగా మారుతుంది.
- రోబ్డ్ వైరస్ వల్ల సంభవించే ఈ వ్యాధి బారిన పడితే మృత్యువు నుంచి బయటపడటం కష్టమని వైద్యులు చెబుతున్నారు.
- పెంపుడు కుక్కలకు ఏటా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఇప్పించాలి.
- కుక్కల ద్వారా చర్మ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశముంది.
- జిల్లాలో రేబిస్ సోకిన పలు పశువులు మృతిచెందాయి.
- పిచ్చికుక్కల నోటినుంచి కారే చొంగ గాయాలకు అంటుకున్నా వ్యాధి సోకుతుంది.
- ఈ వ్యాధి ఎక్కువగా కుక్కల ద్వారా, తక్కువగా పిల్లులు, జంతువుల ద్వారా వ్యాప్తి చెందుతుందని పశు వైద్యులు చెబుతున్నారు.
- పశువుల్లో ఈవ్యాధి సోకితే నాడీ మండలాన్ని ఆశించి పక్షవాతానికి గురవుతాయి. కుక్క కరిచిన తర్వాత రెండు నుంచి నాలుగు వారాల తర్వాత లక్షణాలు బయటపడుతాయి. ఒక్కోసారి కొంత సమయం కూడా పడుతుందని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.
- అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో యాంటీ రేబిస్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి.
- కుక్కల దాడిలో గాయపడిన వారు 24గంటల లోపు టీకా వేయించుకోవాలి

'డబుల్'కు 8,448 దరఖాస్తులు



దరఖాస్తు కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

తాండూరు: మున్సిపల్ పరిధిలో డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం మొత్తం 8,448 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ చిన్నప్పల నాయుడు తెలిపారు. పట్టణంలోని ఆరు కేంద్రాల ద్వారా 36 వార్డులకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించామని పేర్కొన్నారు. శనివారం చివరి రోజని, అర్హులైన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ధారూరులో 356..

ధారూరు: డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం శుక్రవారం నాటికి 356 మంది దరఖాస్తు చేసుకున్నారని డిప్యూటీ తహసీల్దార్ విజయ తెలిపారు. మొదటి రోజైన బుధవారం 250 దరఖాస్తులు వచ్చాయని, గురువారం సెలవు దినం కావడంతో దరఖాస్తుల స్వీకరణ గడువు పెంచే వీలుందని ఆయన పేర్కొన్నారు.

పనిచేసే వాళ్లే కావాలి



చించల్‌పేట వద్ద రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- కలెక్టర్ నారాయణరెడ్డి
- గంగ్యాడ, చించల్‌పేట్‌లో విస్తృత పర్యటన
- హరితహారం నిర్వహణపై తీవ్ర ఆగ్రహం
- పారిశుద్ధ్య పరిరక్షణ చర్యలపై అసంతృప్తి

నవాబుపేట: మండలంలో ఎక్కడా అవెన్యూ ప్లాంటేషన్ కనిపించడం లేదు. హరితహారం ప్రారంభమై ఎన్నేళ్లయింది..? ఎన్ని మొక్కలు నాటారు..? ఎంత డబ్బు ఖర్చు చేశారు..? ఎన్ని మొక్కలు బతికాయి.. ? ఎక్కడా ఒక్క మొక్క కూడా కనిపించడం లేదు.. అసలు మీరేం చేస్తున్నారు..? మీ అందరినీ సస్పెండ్ చేయడానికి ఈ ఒక్క కారణం చాలు'. అని కలెక్టర్ నారాయణరెడ్డి మండిపడ్డారు. పని చేసే వాళ్లే కావాలని.. లేదంటే చర్యలు తప్పవని ఎంపీడీఓ, ఎంపీఓ, ఏపీఓ, కార్యదర్శులను హెచ్చరించారు. ప్రజాధనాన్ని వృథా చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మండల పరిధిలోని చించల్‌పేట, గంగ్యాడ గ్రామాల్లో శుక్రవారం ఆయన విస్తృతంగా పర్యటించారు.

బాధితులను ఆదుకుంటాం

చించల్‌పేట వద్ద మూసీ నదిపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణంలో ఇద్దరు రైతులకు సంబంధించిన 15 గుంటల భూమి పోతోందని, బాధితులకు అంతే స్థలాన్ని మరో చోట ఇస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ రవీందర్‌ను ఆదేశించారు. అనంతరం గంగ్యాడ గ్రామం వద్ద నిర్మిస్తున్న చెక్‌డ్యాంను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. హెల్త్ సబ్ సెంటర్ల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారం వివరాలపై ఆరా తీశారు. మందులు అందజేస్తున్నారా..? సకాలంలో పరీక్షలు చేస్తున్నారా..? అని అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలలో వంట పాత్రలు అపరిశుభ్రంగా ఉండటంపై అసహనం వ్యక్తంచేశారు. మరోసారి ఇలాంటివి పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలలో 52 మంది విద్యార్థులకు 18 మంది గైర్హాజరు కావడంపై హెచ్‌ఎం ఉమామహేశ్వర్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇంత మంది రాకుంటే మీరేం చేస్తున్నారని నిలదీశారు.

పరిశుభ్రత కనిపించడం లేదు..

అనంతరం గంగ్యాడ రైతులతో మాట్లాడుతూ.. పంటలు బాగున్నాయా..? ఏఏ పంటలు ఎక్కువగా సాగు చేస్తున్నారు..? అని అడిగారు. మందు బస్తాలు, మసాలాలు తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నామని తెలపడంతో బస్సులు వేయిస్తామని తెలిపారు. అనంతరం డంపింగ్ యార్డును పరిశీలించారు. తడిపొడి చెత్తను వేరు చేయడం లేదని కార్యదర్శి రాజ్యలక్ష్మిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామంలో ఎక్కడా పరిశుభ్రత కనిపించడం లేదన్నారు. ప్రజలకు చెత్తబుట్టలు ఎందుకు పంపిణీ చేయలేదని ప్రశ్నించారు. ప్రకృతి వనం, క్రీడాప్రాంగణం బాగుందన్నారు. అయితే వీటి నిర్మాణానికి రూ.6 లక్షలు ఖర్చు చేయగా.. కేవలం రూ.80 వేల బిల్లు చేశారని సర్పంచ్ గోవిందమ్మ కలెక్టర్‌కు వివరించారు. దీనిపై స్పందించిన ఆయన ఏఈ మల్లేశం, ఏపీఓ జ్యోతిలను పిలిచి అడిగారు. చేసిన పనులకు బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు.

10జీపీఏ సాధిస్తే రూ.10 వేలిస్తా..

గంగ్యాడ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ నారాయణరెడ్డి బాగా చదువుకోవాలని సూచించారు. అందరూ 10 జీపీఏ సాధించాలన్నారు. స్కూల్ ఫస్ట్ వచ్చిన విద్యార్థులకు సర్పంచ్ రూ.10 వేల బహుమానం ఇస్తున్నారని హెచ్‌ఎం కలెక్టర్‌కు చెప్పగా.. 10 జీపీఏ సాధించిన వారందరికీ తాను కూడా రూ.10 చొప్పున అందజేస్తానని కలెక్టర్ తెలిపారు. స్కూల్‌కు ప్రహరీ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎంపీపీ భవాని, జెట్పీటీసీ జయమ్మ, డీఈ మాధవరెడ్డి, ఎంపీడీఓ సుమిత్రమ్మ, సర్పంచులు శ్రీనివాస్, గోవిందమ్మ, అధికారులు పాల్గొన్నారు.

వేగశ్రీలో ప్రగ్యా జైస్వాల్ సందడి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మగుడి ఎదురుగా ఏర్పాటు చేసిన వేగశ్రీ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంను శుక్రవారం ప్రముఖ సినీ నటి ప్రగ్యా జైస్వాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వేగశ్రీ చైర్మన్ పనమా నవీన్, ఎండీ మణిదీప్ ఏచూరి, కళ్యాణ్ కుమార్ గోళ్ల, సుధాకర్, శ్రీనివాస్ తదితరులు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేగశ్రీ జ్యువెలరీస్‌లో మహిళల మనసుదోచే బంగారు, వజ్రాలు, పోల్కి, కుందన్, విక్టోరియన్ ఆభరణాలు అబ్బురపరిచే రీతిలో ఆకర్షణీయమైన శ్రేణుల్లో కస్టమర్లకు అందుబాటులోకి తీసుకొచ్చామని నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ పారిశ్రామికవేత్త మెఘా సుధారెడ్డి చేతుల మీదుగా ఆకట్టుకునే ఆభరణాల శ్రేణిని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. మహిళలను విశేషంగా ఆకట్టుకునే రీతిలో అత్యుత్తమ జ్యువెలరీలో వేగశ్రీ ఇప్పటికే ఎంతో మంది ఆదరణ చూరగొంటున్నదన్నారు. తెలుగువారి అభిరుచుల మేరకు..ప్రత్యేక డిజైనరీ ఆభరణాలను దృష్టిలో పెట్టుకొని కళాకారులతో వీటిని రూపుదిద్దేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని నిర్వాహకులు వెల్లడించారు.



వేగశ్రీ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో సినీ నటి ప్రగ్యా జైస్వాల్

రైతు వెంటే సీఎం కేసీఆర్



రూ.5 భోజనం వడ్డిస్తున్న మహేశ్‌రెడ్డి తదితరులు

- రైతుబీమా, రైతుబంధు, ఉచిత కరెంట్ పథకాలు చరిత్రాత్మకం
- గిట్టుబాటు ధర, ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ నంబర్ వన్
- ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి
- పరిగి మార్కెట్‌లో రూ.5 భోజనం ప్రారంభం

పరిగి: రైతుల సమస్యలను పరిష్కరించడంతో సీఎం కేసీఆర్ ఎల్లప్పుడు ముందంజలో ఉంటారని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని మార్కెట్ యార్డులో శుక్రవారం హరే క్రిష్ణా మూవ్‌మెంట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.5కే అన్నపూర్ణ భోజనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రైతుల సంక్షేమం కోసం సీఎం అనేక పథకాలను ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. రైతుబంధు, రైతు బీమా, నిరంతర ఉచిత కరెంట్ పథకాలు చరిత్రాత్మకంగా నిలుస్తున్నాయని స్పష్టంచేశారు. పండించిన ప్రతీ పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని స్పష్టంచేశారు. పరిగి మార్కెట్‌కు వచ్చే రైతులు తిండి కోసం ఇబ్బంది పడకుండా ఉండాలనే ఉద్దేశంతో రూ.5కే మంచి భోజనం అందిస్తున్నామన్నారు. రైతులు సేదతీరేందుకు త్వరలోనే విశ్రాంతి భవనాన్ని నిర్మిస్తామని చెప్పారు. మార్కెట్ యార్డులో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, జెడ్పీటీసీ హరిప్రియ, హరేక్రిష్ణా మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ అధ్యక్షుడు సత్య గౌర చంద్రదాస్, సీఈఓ కౌంతియాదాస్, ఉపాధ్యక్షుడు మహావిష్ణుదాస్, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ రాజేందర్, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి


రాజ్‌కుమార్ మృతదేహం

పరిగి: ప్రైవేటు స్కూల్ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పట్టణ కేంద్రంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దోమ మండల కేంద్రానికి చెందిన వారాల రాజ్‌కుమార్(55) స్థానికంగా టీ హోటల్ పెట్టుకుని జీవిస్తున్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్న రాజ్‌కుమార్ ఉదయం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. వికారాబాద్‌కు వెళ్తున్న శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు రాజ్‌కుమార్‌ను ఢీకొట్టింది. దీంతో రాజ్‌కుమార్ తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య ప్రభావతి, కుమారుడు, కూతురు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియలకు ఆర్థికసాయం అందజేశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఇద్దరి బైండోవర్

పెద్దేముల్: తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి ఎదుట ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం ఇద్దరిని బైండోవర్ చేశారు. మండల పరిధిలోని పాషాపూర్ తండాలో శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు చేశారు. తండాకు చెందిన ధనావత్ రవి ఇంట్లో రెండు లీటర్ల బెల్లం ఊట లభించింది. దీంతో బెల్లం స్వాధీనం చేసుకొని ధనావత్ రవితో పాటు ఆయన భార్య కమ్లిబాయిని అదుపులోకి తీసుకొని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. దాడుల్లో ఎస్‌ఐ చంద్రకాంత్, రమేశ్, భీమయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

ఆర్‌ఎంపీ డాక్టర్‌పై కేసు

ధారూరు: మండల పరిధిలోని నాగారం గ్రామంలో ఆర్‌ఎంపీ డాక్టర్‌గా పనిచేస్తున్న జె.నాగేశ్‌పై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. ఆర్‌ఎంపీ డాక్టర్ ఇచ్చిన ఇంజెక్షన్ వల్లే తన తల్లి మృతి చెందిందని కుమారుడు విస్లావత్ చంటి ఫిర్యాదు చేశారని ఆయన వివరించారు. ఈ మేరకు ఆర్‌ఎంపీ డాక్టర్‌పై కేసు నమోదు చేశామన్నారు. ఆర్‌ఎంపీ డాక్టర్ పరారీలో ఉన్నారని, త్వరలో అరెస్టు చేస్తామని చెప్పారు.

108లో ప్రసవం



కుల్కచర్ల: 108లో మహిళ ప్రసవించింది. చౌడాపూర్ మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మి ప్రసవ నొప్పులు రావడంతో వెంటనే 108ను సంప్రదించారు. 108 సిబ్బంది గర్భిణీని కుల్కచర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువస్తున్న క్రమంలో నొప్పులు అధికం కావడంతో 108లోనే సుఖ ప్రసవాన్ని నిర్వహించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని ఈఎంటీ వినోద్‌కుమార్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి


అమీరొద్దీన్ (ఫైల్)

ధారూరు: బైక్ అదుపు తప్పిన ఘటనలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన మండల పరిధిలోని నాగసమందర్ గ్రామ రైతువేదిక సమీప రోడ్డుపై గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగసమందర్‌కు చెందిన సయ్యద్ అమీరొద్దీన్ తన సోదరిని రైలు ఎక్కించేందుకు బైక్‌పై తాండూరు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో రైతువేదిక సమీపంలో కుక్కలు అడ్డు రావడంతో అదుపుతప్పి కిందపడగా తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబీకులు వెంటనే క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్ తెలిపారు. భార్య అబ్రిన్‌బేగం ఫిర్యాదు మేరకు కేసు దార్యప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

శ్రద్ధ చూపితేే 'నవోదయమే'

29న ప్రవేశ పరీక్ష
- విద్యార్థులకు మంచి అవకాశం
- తడబాటు లేకుండా లక్ష్యం దిశగా సాగాలి
- ఆరో తరగతి ప్రవేశాలకు చక్కని మార్గం
- సూచనలందిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు


ఇటీవల నిర్వహించిన మోడల్ నవోదయ పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు

కొడంగల్ రూరల్: జాతీయ విద్యా విధానాన్ని అనుసరించి కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జవహర్ నవోదయ విద్యాలయం గ్రామీణ నిరుపేద విద్యార్థులు కార్పొరేట్ స్థాయి ఉచిత విద్యను పొందేందుకు చక్కటి అవకాశం. ఏప్రిల్ 29న ఆరో తరగతి ప్రవేశాలకు నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ప్రవేశం లభిస్తే ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విలువలు, సాహసోపేత కృత్యాలు, క్రీడలు, పౌష్టికాహారంతోపాటు సమున్నత శిక్షణ నవోదయ విద్యాలయంలో ఉచితంగా లభిస్తుంది. జిల్లాలో ఉన్న విద్యాలయంలో 80సీట్లు ఉండగా వేల సంఖ్యల్లో విద్యార్థులు పోటీ పడుతున్నారు. ఈ క్రమంలో మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇల్లూరి క్రాంతికుమార్ నవోదయ పరీక్షలో సీటు పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎలా ప్రిపేర్ కావాలి అనే అంశాలపై సూచనందిస్తున్నారు.

గుర్తుంచుకోవాల్సిన వివరాలు..

పరీక్షలు రాసేవారందరూ చిన్నారులే కావడంతో తడబాటు లేకుండా ఉండేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ముందస్తుగా ఓసీఆర్ సీటుపై చిన్నారులకు అవగాహన కల్పించాలి. సమాధానాలు గుర్తించడానికి నీలి, నలుపు బాల్‌పెన్ మాత్రమే ఉపయోగించాలి. రఫ్ వర్క్ చేయాల్సి వస్తే బుక్‌లెట్‌లో 16వ పేజీని వినియోగించుకునేలా చిన్నారులకు సూచించాలి. ఒక్కసారి సమాధానం రాసిన తర్వాత మార్చడం, కొట్టివేయడం, దిద్దడం చేయకూడదు. ముందస్తుగా సమాధానం వచ్చిన వాటికి వెంటనే జవాబు రాసే ప్రయత్నం చేయాలి. రాని వాటికి తర్వాత ఆలోచిస్తూ సమాధానాలు రాసే ప్రయత్నం చేయాలి. ప్రతీ 30 నిమిషాలకు ఓ పర్యాయం గంట కొట్టడంతో సమయాన్ని గమనిస్తూ ప్రశ్నలకు సమాధానాలు రాయాలని వివరిస్తున్నారు.

ప్రవేశ పరీక్ష మూడు విభాగాలు..

మేధాశక్తి పరీక్ష 40ప్రశ్నలతో 50మార్కులకు సంబంధించి ఒక గంట సమయం, గణితంలో 20 ప్రశ్నలకు 25మార్కులకు అర గంట సమయం, బాషా నైపుణ్యానికి సంబంధించి 20 ప్రశ్నలకు 25 మార్కులకు అర గంట సమయాన్ని కేటాయించుకుంటూ సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు. 29వ తేదీ శనివారం ఉదయం 11.30గంటల నుంచి 1.30 గంటల వరకు పరీక్ష జరుగనుంది. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ రూపంలో ఉంటాయి. సమాధానాలు ఐసీఆర్(ఇంటలిజెన్స్ క్యారెక్టర్ రికగ్నిషన్), ఓసీఆర్ (ఆప్టికల్ క్యారెక్టర్ రికగ్నిషన్) షీట్లలో అంకెల రూపంలో గుర్తించాలి.

మేధాశక్తి..

మేధాశక్తి విభాగంలో 50 మార్కులకు సంబంధించి బొమ్మలతో కూడిన ప్రశ్నలుంటాయి. ప్రశ్న కింద నాలుగు సమాధానాలు బొమ్మల రూపంలో ఉంటాయి. సమయస్ఫూర్తితో ఒత్తిడికి గురికాకుండా ఆలోచించి సమాధానాన్ని ఎంచుకోవడంతో అధిక మార్కులు సాధించేందుకు వీలుంటుందని పేర్కొంటున్నారు.

గణితం..

గణిత విభాగంలో 25 మార్కులకు సంబంధించి 5వ తరగతి వరకు అన్ని చాప్టర్లపై చిన్నారులకు అవగాహన పెంచేందుకు కృషిచేయాలి. ఒక్కో చాప్టర్ నుంచి ఒకటి లేదా రెండు ప్రశ్నలిచ్చే అవకాశం ఉంటుంది. గణితంలో అధిక మార్కులు సాధించేలా కష్టపడాలి. భాషా పఠనాశక్తి విభాగంలో 5 పాఠ్యాంశాలు ఇస్తారు. వాటి ఆధారంగా ఇచ్చే ప్రశ్నలకు సమాధాలను నిశితంగా గమనిస్తూ గుర్తించాలి.

> **విద్యార్థులకు అవగాహన కల్పించాలి**
>
> నవోదయ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు తల్లిదండ్రులు చక్కటి అవగాహన కల్పించాలి. తడబాటు లేకుండా ఉండేందుకు ప్రశ్న పత్రం ఎలా ఉంటుందో, ఎలా మార్క్ చేయాలో, సమయం సద్వినియోగం చేసుకునేలా వివరించాలి. ప్రశ్న పత్రంలో ఇచ్చే అంశాలపై, వాటికి సమాధానాలు రాసే విధానాన్ని విద్యార్థులకు పూర్తిస్థాయిలో తెలియజేయాలి. ప్రణాళికతో ముందుకు వెళ్తే విజయం సాధించేందుకు ఎక్కువ అవకాశం ఉంటుంది.
>
> – క్రాంతికుమార్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం, పాతకొడంగల్

పుష్కరిణిలో మునిగి మహిళ మృతి

జుంటుపల్లి జాతరలో విషాదం


భీమమ్మ మృతదేహం

యాలాల: ప్రమాదవశాత్తు ఆలయ పుష్కరిణిలో మునిగి మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని జుంటుపల్లి రామస్వామి ఆలయ సమీపంలో జరిగింది. ఎస్‌ఐ అరవింద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బొంరాస్‌పేట మండలం తుంకిమెట్ల గ్రామానికి చెందిన నల్ల భీమమ్మ(40) రేగడి మైలారానికి చెందిన తన చెల్లెలు సత్యమ్మతో కలిసి జుంటుపల్లి జాతరకు వచ్చారు. గురువారం రాత్రి ఆలయ ఆవరణలో బస చేసిన వారు శుక్రవారం ఉదయం ఆలయ పుష్కరిణిలో స్నానమాచరించేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు భీమమ్మ పుష్కరిణిలో పడింది. చెల్లెలు ఈ విషయాన్ని గమనించి కేకలు వేయడంతో స్థానికులు రక్షించేందుకు గాలించారు. చాలా సేపటికి భీమమ్మను బయటికి తీసి తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా అప్పటికే భీమమ్మ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిరంకుశ ధోరణి అవలంబిస్తున్న కేంద్రం


కొండా సురేఖను సన్మానిస్తున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి

మాజీమంత్రి కొండా సురేఖ

అనంతగిరి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరంకుశధోరణి అవలంబిస్తోందని మాజీమంత్రి, కాంగ్రెస్ నాయకురాలు కొండా సురేఖ మండిపడ్డారు. శుక్రవారం వికారాబాద్‌లోని మాజీమంత్రి ప్రసాద్‌కుమార్ నివాసంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టని అన్నారు. రాహుల్ గాంధీ ఎక్కడా విద్వేశపూరిత ప్రసంగాలు చేయలేదన్నారు. తమ నాయకుడిని చూస్తే బీజేపీ నాయకత్వానికి భయం వేస్తున్నట్లు ఉందన్నారు. దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన కుటుంబం నుంచి వచ్చిన మా నేతకు నేడు యావత్ దేశమంతా అండగా నిలుస్తోందన్నారు. ప్రజల పక్షాన ఉంటూ వారి బాగుకోసం ఎంతటికైనా పోరాడుతామన్నారు. ఆర్థిక నేరగాళ్లను పెంచి పోషిస్తోందని విమర్శించారు. భారత్‌జోడో యాత్రతో రాహుల్‌గాంధీకి ఎనలేని ప్రజాధరణ లభించిందన్నారు. ప్రజాధరణను చూసి ఓర్వలేక బీజేపీ కుయుక్తులు పన్నుతోందనాన్నరు. ఎన్ని కేసులు పెట్టినా జైళ్లకు పంపినా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భయపడే ప్రసక్తే లేదన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు మేమంతా కష్టపడి పనిచేస్తామన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీక్‌తో రాష్ట్ర ప్రభుత్వం వేలాదిమంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. అనంతరం పట్టణ పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ఆమెను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సంతోష, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాహన పరిమితులు తప్పనిసరి

- డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి
- బొంరాస్‌పేటలో కార్డెన్ సర్చ్
- 60 వాహనాలు సీజ్


మాట్లాడుతున్న డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి

బొంరాస్‌పేట: వాహన పరిమితులు లేకుండా నడపటం చట్టరీత్యా నేరమని డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి కార్డెన్ సర్చ్‌లో పోలీసులు తనిఖీ చేశారు. శుక్రవారం సాయంత్రం ఎస్‌ఐ పి.శంకర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. వాహనాల తనిఖీలో 53 ద్విచక్రవాహనాలు, నాలుగు జీపులు, కార్లు, మూడు ఆటోలతోపాటు మొత్తం 60 వాహనాలు అనుమతి పత్రాలు లేకపోవడం వంటి కారణలతో సీజ్ చేశారు. జరిమానాలు విధించారు. సరైన పత్రాలు పొంది వాహనాలు తీసుకువెళ్లాలని అన్నారు. తనిఖీల్లో సీఐలు శంకర్, వెంకట రమణయ్య, ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, డబ్ల్యూపీసీలు, పీసీలు, హోమ్‌గార్డులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని శవం

పూడూరు: గుర్తు తెలియని శవం లభ్యమైన సంఘటన మండల పరిధిలోని సోమన్‌గుర్తి అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. చన్గోముల్ ఎస్‌ఐ విఠల్ రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని సోమన్‌గుర్తి అటవీ ప్రాంతంలో పూర్తిగా కాలిపోయిన ఓ గుర్తు తెలియని శవం లభ్యమైందని తెలిపారు. ఉపాధిహామీ కూలీలు పనులు చేస్తుండగా కాలిపోయిన అస్థిపంజరాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పదిహేను రోజుల క్రితం ఈ సంఘటన జరిగి ఉండవచ్చని పరిగి డీఎస్పీ సీఐ వెంకటరామయ్య అనుమానిస్తున్నారు. ఈ మేరకు క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌లతో వివరాలు సేకరించారు. సంఘటనకు కారకులైన వారిని వదిలిపెట్టేదిలేదని పోలీసులు హెచ్చరించారు.

వికారాబాద్ మున్సిపల్ బడ్జెట్ రూ.50.39 కోట్లు

ఏకగ్రీవంగా ఆమోదించిన కౌన్సిల్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ మున్సిపల్ బడ్జెట్‌ను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. శుక్రవారం మున్సిపల్‌లో చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజులరమేశ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని కింది స్థాయి వరకు చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా కృషి చేయాలన్నారు. బడ్జెట్ సమావేశం అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవ తీర్మానంతో 2023–24 సంవత్సరానికి గాను రూ.50కోట్ల 39లక్షల 32వేల అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. బడ్జెట్‌లో పన్నుల రూపంలో వచ్చేవి రూ.9.54కోట్లుగా అంచనా వేసినట్లు చెప్పారు. అలాగే నాన్ ట్యాక్స్‌లు రూ.9.75కోట్లు, డిపాజిట్లు, లోన్‌ల రూపంలో వచ్చేవి రూ.90లక్షలు, గ్రాంట్ రూ.30.20కోట్లు రావచ్చని అంచనా వేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ శరత్‌చంద్ర, వైస్‌చైర్మన్ శంషాద్‌బేగం, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

తాండూరు మున్సిపల్ బడ్జెట్ సమావేశానికి గ్రీన్ సిగ్నల్

తాండూరు: మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల నిర్వహణపై ప్రభుత్వం స్పందించింది. బడ్జెట్ సమావేశంలో అధికార పార్టీలోని ఇరు వర్గాల కౌన్సిల్ సభ్యుల మధ్య అనిశ్చితి నెలకొంది. దీంతో 2022–23 ఆర్థిక బడ్జెట్ ఆమోదం చెల్లదంటూ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్ హైకోర్టును ఆశ్రయించారు. ఏడాది పాటు హైకోర్టులో వాదోపవాదాలు జరిగిన తర్వాత మున్సిపల్ శాఖ అధికారులకు సమస్య పరిష్కరించాలని హైకోర్టు సూచించింది. అయినా నాలుగు నెలలుగా మున్సిపల్ అధికారులు తాండూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల విషయంలో ఆసక్తి చూపించలేదు. కోర్టు నుంచి వచ్చిన ఉత్తర్వులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి స్పందించారు. తాండూరు మున్సిపాలిటీలో 2022–23 ఆర్థిక బడ్జెట్‌తో పాటు 2023–24 ఆర్థిక బడ్జెట్ సమావేశాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిబంధనల ప్రకారం నిర్వహించాలని కమిషనర్‌కు ఆదేశాలు ఇస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను సీడీఎంఏతో పాటు కలెక్టర్‌కు, తాండూరు మున్సిపాలిటీకి ఉత్తర్వులను జారీ చేశారు.

నేటి నుంచి భవానీమాత ఉత్సవాలు


ఆలయంలో భవానీమాత విగ్రహం


విద్యుత్ దీపాలంకరణలో భవానీ మాత ఆలయం

- ఐదు రోజులపాటు దామర్‌చెడ్ జాతర
- సుందరంగా ముస్తాబైన ఆలయ పరిసరాలు
- తరలిరానున్న ఆధ్యాత్మిక గురువులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ పీఠాధిపతి

బషీరాబాద్: మండలంలోని దామర్‌చెడ్‌లో వెలిసిన అంబాభవానీ మాత జాతర ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో కొనసాగే ఉత్సవాల కోసం ఆలయ పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. జిల్లాతో పాటు సుమారు 8 రాష్ట్రాల నుంచి భవానీమాత భక్తులు, ఆధ్యాత్మిక గురువులు తరలివస్తారని ఆలయ పీఠాధిపతి శ్రీశంకర్ స్వామిజీ తెలిపారు. స్వర్గీయ మాణిక్యప్ప పూజారి మహా సంస్థానంలో అంబా భవానీ మాత దేవస్థానం ప్రసిద్ధి చెందింది. ఆలయ పరిసరాల్లో భవానీ మాతతో పాటు శంకరుడు, స్వయంభు శ్రీకష్ణుడు, దత్తాత్రేయ స్వామి, సాయి బాబా, వినాయకుడు, ఆంజనేయ స్వామి, ఉగ్ర నర్సింహస్వామి, మహాలక్ష్మి, మహిశాసుర మర్దిని, నవగ్రహాలు ప్రతిష్ఠించారు. ఈ దేవాలయాల సమూహానికి భవానీ నగర్‌గా నామకరణం చేశారు. అమ్మవారికి, దేవతామూర్తులకు నిత్యం పూజలు జరుగుతాయి. ప్రతి పౌర్ణమికి పల్లకీ సేవ, అమావాస్యకు దీపారాధన నిర్వహిస్తారు. ఏటా కార్తీక మాసంలో లక్షదీపోత్సవం కనుల పండువగా నిర్వహిస్తారు. ప్రతిఏటా చైత్ర శుద్ధ పౌర్ణమి రోజున భవానీ అమ్మవారి జాతర నిర్వహించడం 1974 నుంచి ప్రారంభమైంది. ఉత్సవాలకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఉత్తరఖాండ్, తమిళనాడు, గుజరాత్ నుంచి భక్తులు, ఆధ్యాత్మిక గురువులు వస్తుంటారు. తాండూరు నుంచి ఆర్టీసీ బస్సు సౌకార్యం ఉంది.

కార్యక్రమాలు ఇవీ..

ఒకటి నుంచి ఈ నెల 5 వరకు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు జరుగుతాయి. మొదటి రోజు దేవీ భాగవత పురాణం మాడపతి సిద్ధిలింగయ్య స్వామి చేత ప్రవచనం నిర్వహిస్తారు. అలాగే 108 మంది దంపతులతో అమ్మవారికి మహాభిషేకం చేస్తారు. ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు లమ్మవారికి కుంకుమార్చన చేస్తారు. సోమవారం మహాశివుడికి లక్ష బిల్వార్చన జరుగుతుంది. మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు చేపడతారు. బుధవారం ఉదయం 9 గంటలకు మృత్యుంజయ హోమం, గాయత్రి హోమం, ఉదయం 11 గంటటలకు లక్ష్మీనర్సింహ, పార్వతీపరమేశ్వర కల్యాణం జరుగుతుంది. సాయంత్రం 5 గంటలకు అమ్మవారి పాదాల వద్దకు పల్లకీ ఊరేగింపు, రాత్రి 11 గంటలకు దేవీభాగవత పురాణ మహామంగళం, గురువారం ఉదయ సుప్రభాత సేవ, ఉదయం 8 గంటలకు గంగాస్నానం, పల్లకిసేవ, రాత్రి తొమ్మిది గంటలకు మహాభిషేకం, శతఘటాభిషేకం చేస్తారు. చివరి రోజు బోనాలు, మహాప్రసాద వితరణ జరుగుతందని తెలిపారు.


దత్తాత్రేయ స్వామి విగ్రహం

1,663 మందికి రూ.11.60 కోట్ల రుణాలు

డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి

కుల్కచర్ల: రైతు సంక్షేమమే తమ అభిమతమని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘ కార్యాలయంలో శుక్రవారం వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల్కచర్ల ప్రాథమిక సహకార సంఘంలో 5,621 మంది క్రియాశీల సభ్యత్వం కలిగి ఉన్నారన్నారు. వీరిలో 1,663 మందికి రూ.11.60 కోట్ల రుణాలు అందజేశామని తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అన్ని సహకార సంఘాల్లోనూ రైతులకు మేలు చేకూర్చే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. గత ప్రభుత్వాల హయాంలో సంఘాలన్నీ నష్టాల్లో ఉండేవని, సీఎం కేసీఆర్ అధికారం చేపట్టిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయిందని తెలిపారు. అనంతరం సభ్యులకు వాచీలు అందజేశారు. సమావేశానికి వచ్చిన రైతులకు మండల వైద్యాధికారి వాజుద్దీన్ సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు యాదవ్, సీఈఓ బక్కారెడ్డి, బీఆర్‌ఎస్ చౌడాపూర్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కుల్కచర్ల సర్పంచ్ సౌమ్యారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రాంలాల్, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

తాండూరులో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్

భవనాన్ని కేటాయించిన మున్సిపల్ అధికారులు

తాండూరు: పట్టణంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు మున్సిపల్ అధికారులు భవనాన్ని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణంలోని శాంతినగర్ పార్కు పక్కన ఉన్న మున్సిపల్ భవనం గతంలో ఈ సేవ కేంద్రం నిర్వహణకు ఉపయోగించారు. ఈ సేవ కేంద్రాలను ఎత్తేయడంతో ఏళ్లుగా వృథాగా ఉంది. గతంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు భవనం కేటాయించాలని పోలీసు అధికారులు విన్నవించారు. ఈ విషయంపై కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ఆమోదం పొందింది. శుక్రవారం శాంతినగర్‌లో ఉన్న భవనాన్ని పోలీసు శాఖకు కేటాయిస్తున్నట్లు ఉత్తర్వులను తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్, పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డిలకు అందించారు. మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ అశోక్ కుమార్, అధికారులు శాంతినగర్‌లోని భవనాన్ని సందర్శించారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు అనుగుణంగా మార్పుకునేందుకు పనులు ప్రారంభిస్తామన్నారు. త్వరలోనే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ అందుబాటులోకి వస్తుందని అధికారులు తెలిపారు.

చేసిన సేవలే గుర్తుండిపోతాయి

అనంతగిరి: విధి నిర్వహణలో మనం చేసిన సేవలే ఎల్లవేళలా గుర్తుండిపోతాయని ఆర్టీసీ డీఎం బక్షినాయక్ అన్నారు. ఈమేరకు శుక్రవారం డిపోకు చెందిన ఇద్దరు కండక్టర్లు సులోచన, స్వామిదాసు పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో అధికారులు సిబ్బంది, సహచరులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో ప్రయాణికుల సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఇద్దరు కూడా కండక్టర్లుగా ఎంతో క్రమశిక్షణతో పనిచేసి మంచి పేరు తెచ్చి పెట్టారన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.


పదవీవిరమణ పొందిన కండక్టర్లను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది తదితరులు